# అభాగ్యులు...

రచన :
"ప్రవీణ్ సుశ్రీ"

క్రిష్ణవేణితో మధుకు పరిచయమై అప్పటికి దాదాపు రెండు నెలలు కావస్తూంది. ఈ రెండు నెలల్లో వారు మాట్లాడుకున్న మాటలు వ్రాయాలంటే! ఒక పెద్ద గ్రంథంలా తయారౌతూందేమో! ఆడిన ఆటలు, ఒక పెద్ద చిత్రంగా చిత్రించవచ్చునేమో! మధుకు క్రిష్ణవేణితో పరిచయం అయినప్పటి నుంచి, క్రిష్ణవేణిని ఆ పార్కులో కలుసుకుని కబుర్లాడని సాయంత్రమంటూ ఏదీ లేదు. క్రిష్ణవేణిని కలుసుకోని క్షణం ఒక యుగంలా వుంటుందాతనికి, నిద్రలేచింది మొదలు, రాత్రులు పడుకోబోయేంత వరకూ క్రిష్ణవేణినే జపిస్తూ గడిపేవాడు. ఇంతెందుకు క్రిష్ణవేణి ఎప్పుడూ మధుమనోఫలకంపై వయ్యారంగా నాట్యం చేస్తున్నట్లుంటుందాతనికి. ఇంటి వద్ద నుండి వుత్తరాల మీద వుత్తరాలు వస్తున్నా మధు క్రిష్ణవేణిని వదలి వెళ్ళలేక పోతున్నాడు.

అతనేగాదు. క్రిష్ణవేణి కూడా అంతే! లేకంటే ప్రతి సాయంత్రం మధుకొరకు ఆ పార్కులో ఎందుకు నిరీక్షిస్తుంటుంది? వీరిద్దరి మధ్యా ఇంతటి సన్నిహితం చనువు స్నేహం ఏర్పడడానికి వారి తొలిపరిచయంనాటి ఓ చిన్న సంఘటనే బలవత్తరమైన కారణంగా స్థిరపడి పోయింది.

◆ ◆ ◆

మధు శ్రీమతి సరోజ దగ్గర లీవు గ్రాంటు చేయించుకున్న తర్వాతనే తనుపని చేస్తున్న బాబాయిగారి పత్రికాఫీసులో లీవు గ్రాంటు చేయించుకుని అక్కాబావలు వుంటున్న బందరు వచ్చేశాడు. ఉత్తరాలు రాయగా రాయగా చూచి పోదామని తీరావస్తే బావ క్యాంపుకి వెళ్ళినట్లు బావ వచ్చేంతవరకు తనకు తోడుగా వుండమంది అక్క. బావ క్యాంపుకు వెళ్తే నెలా రెండు నెలల వరకూ ఇంటి ముఖం చూడడు. మధు ఏమీ బదులు పలకలేదు. శ్రీమతికి, బాబాయికి వెంటనే వుత్తరాలురాసి పడవేశాడు, తాను లీవు అయినా ఇప్పట్లో రావని, ఎపుడువచ్చేదీ తర్వాత తెలియ బరుస్తానని!

మధు ఇంటర్ మీడియట్ వరకూ చదువుకున్నాడు. మనిషి పొడగరి, పొడవుకు తగ్గ లావు, ఎఱ్ఱగా చూడ్డానికి అందంగానే వుంటాడు. పైజామాలాల్చీ ఈ దుస్తుల్లోనే అందరికీ అగుపిస్తాడు. వేసుకున్న లాల్చీలోంచి కండలు మెలికలుగా తిరిగిన, అతని శరీరం సర్వాంగ సుందరంగా కన్పిస్తుంటుంది. పెళ్ళిఅయినా కాని వాడిలాగానే అందరికీ అగుపిస్తాడు మధు. ఇతన్ని చూచిన ప్రతి వారూ అతను "మంచి కథా రచయిత" అని ఇట్టే పసిగట్టేస్తారు.

మధు అక్క రాజ్యం అంటే మధుకు ఎంతో ఇష్టం. ఆమె స్కూలు టీచరు ఆమెకు సంతానం ఒకతే కూతురు. మూడవ క్లాసు చదువుతూంది. ఆ రోజు రాజ్యం, అను తమ స్కూలుకు వెళ్ళారు. ఇక వాళ్ళు సాయంత్రానికి గాని ఇంటికిరారు. మధుకు ఏమీ తోచడంలేదు రేడియో తిప్పాడు కరంటులేదు కాబోల్ను అది పలుకలేదు, పలుక లేదు. ఏమి చేయడం? గడియారం వైపు చూశాడు. 9-30 గం॥ అయింది, లైబ్రరీకి పోవచ్చునను కొని, డ్రస్ చేసుకుని ఇంటికి తాళాలువేసి బయలుదేరాడు. ఆనాడు మరీ కోపంగా వున్నాడు కాబోల్ను తన అనంత కోటి కిరణాలతో లోకాన్నంతా మలమలా పల్లుల్లామాడ్చేస్తున్నాడు, భానుడు కిరణానికి మధు చమటకు తడిసి ముద్దయి పోతున్నాడు హైస్కూలుకు టైం అయ్యింది కాబోల్ను పిల్లలు చమటలు కారుస్తూ, భారంగావున్న బ్యాగులతో చకచక మని చమటలు గ్రక్కుతూ పోతున్నారు. ఆడపిల్లల గ్రూపు వారి వెనగ్గా మగపిల్లల గ్రూపు, ఒకరినొకరు దొంగచూపులు చూసుకుంటూ, కళ్ళతో పలుకరించుకుంటూ, నవ్వుకుంటూ వెళ్తున్నారు.

మధు వాళ్ళను చూశాడు నవ్వుకున్నాడు తనలో,

ఆ నవ్వులో గత స్మృతులన్నీ గుర్తుకు వచ్చాయి.

ఆ రెండు జట్లూ మలుపు తిరిగాయి. మధు ఆగత మధుర క్షణాలన్నీ నెమరేసుకుంటూ వెళ్తున్నాడు.

పరధ్యానంగా ఇంతలో ఓ అమ్మాయి, తన ప్రక్కగా స్టేట్ బస్ రావడం మూలంగా మధును రాసుకుంటూ రష్యావాళ్ళ రాకెట్ లా దూసుకు పోబోయింది, ఆ తా

డికి పాపం పుస్తకాలన్నీ క్రింద పడిపోయ్యాయి.

ఆ అమ్మాయి మధువేపు అదోలా చూచి, పుస్తకాలను, ఏరుకోడానికి ఉపక్రమించింది. మధుకి జాలి వేసింది, తానూ క్రిందికి వంగికొన్ని ఏరుతున్నాడు ఆ అమ్మాయినే చూస్తూ. మరి ఎంతసేపట్నుంచి అలా చూస్తాడోగాని ఆ అమ్మాయి "చాలా! థ్యాంక్ అండీ!" అని ముందుకి నడిచి మర్రివూడల్లా వ్రేలాడుతూన్న తన రెండు జడలను వయ్యారంగా పైకి వేసుకోవడంతో అవి మధుముఖాన్ని ముద్దెట్టుకు నెంతవరకూ అతడీలోకంలోకి మరలా మరలి రాలేకపోయాడు. జవాబుగా చిరునవ్వునవ్వి వూరుకున్నాడు.

వీరిద్దర్నీ చూచి దారిన పోయేదానయ్యలంతా ఏమన్నా అపోహపడి పోతారేమోనని అనుమానంగానీ, భయంగా నీవీరిద్దరిలో ఏ ఒక్కరికీ లేదు. అంతేకాదు వుండాల్సిన అవసరంగూడా లేదు. ఏమంటే ఆ అమ్మాయికి పట్టుమని పదేళ్ళుగూడా నిండలేదు. తొమ్మిదికిపైగా వుండొచ్చు. అప్పటికే చాలా టైం అయినట్లుగా వుందికాబోల్ను, పుస్తకాలను పట్టుకొని పడిపడిగా రోడ్డుమీద పోతూంటే వేసుకున్న హైహీల్సు వల్ల, ఆ రెండు జడలవల్లనే పాప ఇంత ఆలస్యంగా బడికి పోతూందను కున్నాడు. పాప ముందు మధు కొంచం వెనక నడుస్తూ వెళ్తున్నారు. ఎందుకో మధుకి ఆ పాప మీద ఒక్కసారిగా ప్రేమాభిమానాలు పుట్టుకవచ్చాయి. పలుకరించాలనే దురుద్ధి పుట్టుకవచ్చింది.

"పాపా...!"

జవాబులేదు.

"పాపా...! రెండోసారి పిలిచాడు.

"ఏమిటండీ! పిలిచారు?" అన్నట్లుగా వెనుతిరిగి చూచింది. పాప,

"పాపా! నీపేరేమిటి? పాపతో సమానంగా నడుస్తూ.

"క్రిష్ణవేణి" అంది పాప చిరునవ్వుతూ.

"పేరు చాలా చక్కగా వుంది నీలా" అన్నాడు నవ్వుతూ.

...మరలా "పాపా నీవేఫారం చదువుతున్నావ్" అడిగాడు.

...పాప చెప్పింది. తాను చదివే క్లాసు...గబగబా నడుస్తోంది. ఆఖరి గంటకాబోల్ను గణగణ మ్రోగుతోంది. మధు తెలుసుకో లేక పోయాడు స్కూలు దగ్గరకు వచ్చేశానన్న విషయం. పాప స్కూలు ఆవరణలోకి రాగానే పోతూ! పోతూ "టాటా! అంకుల్" అని చెప్పి, మరరా వెనక్కు తిరిగి చూచింది నవ్వుతూ. ఇంతలో పాపం మధు క్రిష్ణవేణివైపు చూస్తూ "టాటా" అని చెయ్యి వూపుతూ పోతూపోతూ, ఒక ముసలావిడను 'ఠపీ' మని గుద్దుకున్నాడు. అవ్వ క్రిందపడిపోయింది. చేతిలో కర్ర అల్లంత దూరాన్న పడింది.

"నేను గుడ్డిదాన్నయిలే! నీవూ గుడ్డివాడివా?"



వేదమనివారి అపూర్వ తయారింపులు!!

- ఆర్ట్‌సిల్క్ జముఖానాలు,
- కాటన్ కార్పెట్లు,
- బెడ్ షీట్లు,

మేము పైరకాలను అతి నవీన యంత్రసాధనముతో చిరకాలముగా తయారిస్తున్నాము.
ఏజెంట్లుకు మంచి కమిషన్ ఇవ్వబడును. ఏజెన్సీ వివరాలకు రాయండి.

కేంప్ కాట్, కార్పెట్లు, ఫేన్ కాంప్ కార్పెట్లు మా ప్రత్యేకత.

PHONE: 644

VEDAMANI TEXTILES P. B. No. 511 BHAVANI - 638 301.

గీతాలాపన చేస్తుంది. తనకు వచ్చిన మధుకు తెలియని భాషలో ఏమేమో మంత్రాలు వల్లె వేస్తుంది. మధు క్షమించమనంటూ! రెండు రెక్కలు పట్టుకుని పైకిలేపి, దూరంగా పడివున్న కర్రను చేతికిచ్చాడు. ఇంతలో కిల కిలా మని నవ్వులు, వినపడగానే మధు అటు స్కూలు గేటువైపు చూశాడు. నలుగురైదుగురు పిల్లలు నవ్వుతూ కనిపించారు, వానిలో మధు బంగారు పాప కూడా వుంది. చుట్టుప్రక్కల వాళ్ళు మధును వింత పశువును చూచినట్టుగా చూడ్డం, వారు నవ్వడం ఇవన్నీ పిచ్చి వాణ్ణిగా చేశాయి. తల వంచుకుని అక్కడి నుంచి చర చరా మని వచ్చేశాడు పాప వైపన్నా చూడకుండా! ఈ చిన్ని తొలి సంఘటనే వార్ని పరిచితుల్నిగా చేసింది. మాటలను కలిపింది. చనువును స్నేహాన్ని పెంపొందించింది. ఒకర్నొకరు మరువకుండగను, విడవకుండగను చేసింది.

ఆనాటి నుండి మధు ప్రతిరోజూ...అదే టయానికి బేబీ సెంటరుకువచ్చి, నిలబడి నిరీక్షిస్తుండేవాడు. ఆ పాపను స్కూలు వరకు సాగనంపుతూండడం. పరిపాటై పోయింది. మధ్యలో ఎన్నెన్నో కబుర్లు చెప్పేది. ప్రక్క తన స్నేహితు రాండ్రతో కలిసి మధును గోల చేసేది. మధును "అండీ" అని మర్యాదగా సంభోదించేది. "మామయ్యా" అనేడి ఒక్కోసారి.

♦ ♦ ♦

అది ఒక సాయంత్రం మునిసిపల్ పార్కు రేడియోలో "వెంకన్న కాపురం" నాటిక వినబడుతోంది. వినేవాళ్ళు వింటున్నారు. బటానీలు అమ్మే పిల్లవాడు ఆశగా అందరి దగ్గరకు తిరుగుతున్నాడు. అల్లంతదూరాన్న కొంత మంది, మూఠాలు, మూఠాలుగా కూర్చుని పేకాట ఆడు కుంటున్నారు. కొంత మంది జారుడు బల్లల మీద నుండి జారిపోతున్నారు. ఆడపిల్లలు మాత్రం ఉయ్యాలలూగుతున్నారు. మధుకు మాత్రం ఇవేం పట్టడం లేదు. ఆ బంగారు పాపే! ఆ క్రిష్ణవేణే గుర్తుకు వస్తుంది.

కాసేపటికి తాను బజార్లో కొన్న "కథాంజలి" మాస పత్రిక గుర్తుకు వచ్చింది. అందులో తాను రాసిన "రాధ నవ్వింది" అనే కథగూడా వుంది. తనకు ఎడిటర్ పంపిన ఫ్రీకాపీ విజయవాడలో వుంది. ఆ కథను తాను అప్పటికే ఎన్నోసార్లు చదివాడుకానీ! మరలా చదువాలనిపించింది.

కథ కోసం పత్రిక తిరగవేశాడు. నవ్విన రాధ అగుపించింది. కథ చదవడం మొదలు పెట్టాడు. రాధ ఒక విధమైన కొంటె అమ్మాయి. చూపులకు అందంగా ఆకర్షణీయంగా వుంటుంది. మగవాళ్ళంటే మోసగాళ్ళనీ, ఆ మోసగాళ్ళనే పిచ్చి వాళ్ళనుగా చేయాలని, ఆమె ఆశయం.

తన అందచందాల ద్వారా ఎంతమందినో కాలేజీ కుర్రాళ్ళను, తన వైపు ఆకర్షించుకొంది రాధ. వారిని ఆప్యాయంగా పిలిచి వారు నిజంగా ప్రేమించిందనే భ్రమలో ఆశగా దగ్గరకు రాగా నానా చీవాట్లు పెట్టేది. తర్వాత నవ్వి "ఐయామ్ సారీ! మిష్టర్ నావుద్దేశం ఇదే!" అనేది. ఇలా చేయడం ఈమె కొక హాబీగా తయారైంది. ఇలావుండగా ఒకరోజు మధు చదువుతుండగ ప్రొద్దున్న తన భార్య దగ్గర నుండి వచ్చిన వుత్తరం విషయం చటుక్కున జ్ఞప్తికి వచ్చి, జేబులు తడిమి చూశాడు. ఉత్తరం దొరికింది. అది సరోజని వ్రాసిన లెటర్ నెంబర్ వన్.

"ఏమండీ! మీరెందుకు నాదగ్గర నుండి దూరం అవు దామనుకుంటున్నారు? మీరెందుకలా ప్రవర్తిస్తున్నారు? మీరు వెళ్ళినప్పటి నుండీ నా మనస్సేమీ బావుండుట లేదు. రాత్రులు పీడ కలలు వస్తున్నాయి. నాకేమో భయంగా వుంది. ఇంట్లో అత్తగారూ, పని మనిషీ లక్ష్మి రోజూ ప్రతిదానికీ కీచులాడుకుంటున్నారు. ఈ మొదటి కాన్పుకైనా మీరు నాదగ్గరవుండాలని... ఇక్కడ అందరూ కోరుకుంటున్నారు.

ఈ వుత్తరం చూచిన మరుక్షణమే తప్పకుండ రావాలని కోరుచున్న,

"మీ సరోజ"

అని వుంది. మధుకు దానివలన ఏమీ చలనం కలుగలేదు నవ్వుకున్నాడు. ఇంతలో ప్రక్కను పెట్టిన 'కథాంజలి' మాస పత్రిక మెల్లమెల్లగా జరిగిపోతూండటం మధు ఓరగా చూశాడు.

(సశేషం)